*ఎమ్బీయస్ క్రైమ్ రచన - 07*

## క్రైమ్ కథ - పైకి వచ్చే సాధనం

**"లిఫ్ట్** ఆపరేటర్ లేడీయా?" అని ఆశ్చర్యపోయాడు దొంగతనం కేసు విచారిస్తున్న ఇన్‌స్పెక్టర్ శుభాంకర్.

"మా కాంప్లెక్స్‌కి స్పెషల్ ఎట్రాక్షన్ అదే కదా!" అంటూ నవ్వాడు బాంబే కనస్ట్రక్షన్ కంపెనీ మేనేజరు.

"కానీ లేడీస్ అంటే కష్టమే కదా, లిఫ్ట్‌లో ఒక్కోప్పుడు మగవాళ్లతో బాటు ఒంటరిగా వెళ్లడం కూడా తటస్థిస్తూ ఉంటుంది. అలాటప్పుడు వాళ్లు ఈ ఆపరేటర్లతో ఏదైనా వెర్రివేషాలు వేస్తే?" ఇన్‌స్పెక్టర్ సాగదీసాడు.

"వాళ్లని చూస్తే అలాటి అనుమానం రాదు లెండి, పిలుస్తున్నారుగా మీరే చూద్దురు గాని."

అప్పుడే గదిలోకి వచ్చిన సుభాషిణిని చూడగానే తెలిసింది మేనేజరు మాటల్లో ఉన్న అర్థం. లావుగా, పొడుగ్గా ఉంది. రంగు బాగానే ఉంది మొహం కూడా ఫర్వాలేదు. అయినా మొగతనం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. చూడగానే కోరిక రగిలేలా లేదు. ఒకవేళ రగిలినా ఆమె ఔనంటే తప్ప ఎదుటివాడు చెయ్యివేయలేడు అని అనిపిస్తుంది.

సుభాషిణి తీరు చిన్నప్పటినుంచీ అంతే. పెద్ద పెర్సనాలిటీ వల్లనేమో మగపోకడలు ఆటోమెటిక్‌గా వచ్చేశాయి. ఆమె హావభావాలు చూసి మగాళ్లెవరూ వెంటబడలేదు. చదువు కూడా పెద్దగా అబ్బకపోవడంతో మంచి ఉద్యోగమూ రాలేదు, పెళ్లి కూడా కాలేదు. అంతలో ఈ ఉద్యోగం ఆఫర్ వచ్చింది. కాంప్లెక్స్‌లో ఉన్న మూడు లిఫ్ట్‌స్‌కి లేడీ ఆపరేటర్లనే పెట్టారు. అందం విషయానికొస్తే తక్కిన వాళ్లిద్దరి కంటె సుభాషిణియే నయం.

అందుకే లాగుంది లిఫ్ట్ మెకానిక్ మధు ఆమె అంటే ఇష్టపడతాడు. కానీ ఆ ఇష్టాన్ని కనబరచడు. ఎప్పుడూ సుభాషిణిని టీజ్ చేస్తుంటాడు. ఆమె మొహం ముడుచుకుంటే హాయిగా నవ్వుతాడు. ముఖ్యంగా లిఫ్టు శుభ్రత కోసం ఆమె పడే చాదస్తం గురించి తెగ ఏడిపిస్తాడు. మెంటెనెన్స్ అగ్రిమెంటు ప్రకారం వారానికోసారి లిఫ్ట్ కంపెనీ వారు వచ్చి అన్నీ పనిచేస్తున్నాయో లేదో చెక్ చేయాలి. అలా వచ్చిన రోజున చూడాలి వాళ్లిద్దరి హడావుడి!

'ఇదిగో స్క్రూ డ్రైవరు కింద పడేసావు. కార్పెట్ మీద చిల్లు పడింది; సిగరెట్ కాల్చేవు. బూడిద కింద పడింది; ఆనుకుని నిల్చున్నావు, స్విచ్ బోర్డు మీద ఆయిల్ మరక పడింది. ఇలా అయితే నేనూరుకోను' అంటూ ఏదో ఒకదానికి సుభాషిణి గొడవచేస్తుంది. "ఇలా అయితే పని మానేసి పోతాను. రేపు నాలాటి వాడు మొగుడిగా తగిలితే ఏం చేస్తావో చూస్తాను' అంటూ మేలమాడతాడు మధు. బుంగమూతి పెట్టి అతన్ని వెక్కిరిస్తుంది సుభాషిణి. ఇదంతా చూసి అందరూ నవ్వుకుంటూంటారు.

నిజానికి మధు, సుభాషిణిల మధ్య ప్రేమ అంకురించడానికి కూడా ఇది దోహదం చేసింది. ఒకరోజు లిఫ్టు ఫాన్ సరిగ్గా పనిచేయకపోవడంతో లిఫ్టు పైకప్పుకి ఉన్న ఫాల్స్ సీలింగ్ పీకవలసి వచ్చింది మధుకి. ఫాన్ పక్కగా ఒక చిన్న తలుపులాటిది ఉంది కానీ సాధారణంగా ఎవరూ దాని జోలికి పోకపోవడంతో చాలా మట్టి పేరుకుపోయింది. ఆ రోజు ఫాన్ మోటారు కాలిపోవడంతో ఆ తలుపులోకి చేయి పోనిచ్చి గట్టిగా గుంజాడు మధు. అందువల్ల అక్కడున్న దుమ్ము, దూగరా అంతా కింద పడి లిఫ్ట్ కార్పెట్ మాసిపోయింది.

ఇక సుభాషిణి గంగవెర్రులెత్తిపోయింది. 'ముందు చెబితే గోనెబరకా అయినా వేసి కార్పెట్ మాసిపోకుండా చూసుకొనేదాన్ని కదా' అంటూ పోట్లాటకు దిగింది. మధు ఎన్ని జోకులు వేసినా చల్లారలేదు. ఆమెను సముదాయించలేక నానా అవస్థపడి, చివరికి 'నేను చేసినది తప్పే. ప్రాయశ్చిత్తంగా నిన్ను సినిమాకు తీసుకెళతాను ఇవాళ, సరేనా' అన్నాడు.

ఆ సాయంత్రం సినిమాహాల్లో కాస్త చనువు తీసుకున్నా సుభాషిణి అడ్డు చెప్పలేదు. సినిమా తర్వాత ఓ పెద్ద హోటల్లో డిన్నర్ తీసుకుందామన్నాడు. నీకింత డబ్బు ఎక్కడిదంది ఆమెను. "నీకు తెలియనిదేముంది? ప్రతి నెలా బాంబే కన్‌స్ట్రక్షన్ కంపెనీ వాళ్లు ఇచ్చే పై జీతం ఉంది." అన్నాడు మధు హుషారుగా.

ఆ బిల్డింగులోనే బాంబే కనస్ట్రక్షన్ కంపెనీ ఎనిమిదవ ఫ్లోర్‌లో ఉంది. ప్రతీ శుక్రవారం వాళ్లు బాంక్ నుంచి డబ్బు పట్టుకొచ్చి స్టాఫ్‌కి, లేబర్‌కి, కాంట్రాక్టర్లకి జీతాలు పంచుతూంటారు. డబ్బు చాలా పెద్ద మొత్తంలోనే ఉండడంతో బ్యాంక్ నుంచి సొమ్ము తేవడానికి స్టాఫంతా జంకి 'మేం వెళ్లం అంటే మేం వెళ్లం' అనేవారు. ఆ ఒక్క రోజు భాగ్యానికి వేరే సెక్యూరిటీ మనిషిని పెట్టాలా అని ప్రొప్రయిటర్ బాధ.

ఓ రోజు మధుతో మాట్లాడుతూంటే తెలిసింది అతను మిలటరీలో పనిచేసి వచ్చేడని. "ఇంకేం? ప్రతీవారం నువ్వు బాంక్‌నుంచి డబ్బు విత్‌డ్రా చేసి కంపెనీకి తీసుకురా. నెలకో 500/- ఇస్తాను." అన్నాడు. సరేనన్నాడు మధు. పదినెలలుగా ఆ ఏర్పాటు చక్కగా జరిగింది. ఈ సారి కూడా సవ్యంగా జరిగివుంటే సుభాషిణి ఈ రోజు పోలీసుల నెదుర్కొన రావలసి ఉండేది కాదు.

"ఏం జరిగిందో వివరంగా చెప్పు." అంటున్నాడు శుభాంకర్.

"ఇవాళ శుక్రవారం కదా. పదకొండుగంటలకు బాంబే కంపెనీ వాళ్ల డబ్బు బాంక్ నుంచి మధు పట్టుకొస్తాడు. అతను వచ్చినప్పుడు లిఫ్ట్‌లో ఎవర్నీ ఎక్కనివ్వకుండా డైరెక్టుగా ఎనిమిదో ఫ్లోరుకి తీసుకెళ్లిపోవడం ఆనవాయితీ. ఇవాళ ఆ టైముకి లిఫ్ట్ గ్రౌండ్‌ఫ్లోర్‌కి తీసుకువచ్చాను. 'అవుట్ ఆఫ్ ఆర్డరు' అని బోర్డు పెట్టేసి బయటకు వచ్చేసరికి మధు టాక్సీకి డబ్బు ఇస్తూ కనబడ్డాడు. వెంటనే నేను లిఫ్ట్ దగ్గరికి చేరి బోర్డు తీసేసి లోపలికి వచ్చాను. లోపల ఒక వ్యక్తి దాగున్నట్టు తెలియలేదు - అతను వెనక్కాల నుంచి తుపాకీతో పొడిచేదాకా. "అరవద్దు. అతన్ని లోపలికి రానియ్యి." అని వినబడింది.

మధు ఈ లోపున ఎవరికో విష్ చేస్తూ "రెడియేనా?" అంటూ బాగ్ పట్టుకుని లోపలికి వచ్చేసాడు. లిఫ్ట్ తలుపు ఆటోమెటిక్‌గా

మూసుకుపోయింది. తుపాకీ తొలగినట్టుగా అనిపించి, ధైర్యం చేసుకుని తిరిగిచూసాను. ఒక బ్రౌన్ పేపరుసంచీకి కళ్ల దగ్గర రెండు కన్నాలు పెట్టుకుని ఒక మనిషి కనబడ్డాడు. తుపాకీ ఇప్పుడు మధు వీపులో గుచ్చి "చేతులు పైకెత్తు" అన్నాడు.

నేను అతనికేసి చూడడం గమనించి "7 నొక్కు" అన్నాడు. నొక్కాను. అప్పటికే మధు మొహాన్ని లిఫ్ట్ తలుపువైపుకి తిప్పిపెట్టి చేతిలోంచి కేష్‌బాగ్ లాగేసుకున్నాడు. మధు చేతులు పైకెత్తి నుంచున్నాడు పళ్లు కొరుకుతూ. ఏడో ఫ్లోర్‌లో లిఫ్ట్ ఆగుతూనే అతను మధుని బయటకు నెట్టేసాడు. ఏం జరుగుతోందో తెలిసేలోగానే నేనూ వెళ్లి కారిడార్‌లో పడ్డాను."

"దెబ్బలు తగిలాయా? ఏదీ చూడనీ." అన్నాడు శుభాంకర్. కొట్టుకుపోయిన ఆమె మోచేయి పరీక్షగా చూసి తలాడిస్తూ, "తరువాత?" అని అడిగాడు.

"పడ్డదాన్ని లేస్తూ మధు కోసం చూస్తే అప్పుడే అతను మెట్ల ద్వారా క్రిందకు పరుగెత్తుతున్నాడు. "ఫోన్ చేయి, పోలీసులకు ఫోన్ కొట్టు" అంటూ అరిచాడు. లిఫ్ట్ కిందకు చేరేంతలో అతనెంత వేగంగా పరిగెట్టినా వెళ్లి అందుకోగలడా? దొంగాణ్ని పట్టుకున్నా వాడి చేతిలో తుపాకీ ఉందికదా! వాడి దగ్గర్నుంచి బాగ్ లాక్కోవడం సాధ్యమా? అదే చెప్దామనుకుంటూ ఉంటే వినిపించుకోకుండా పరిగెట్టాడు. నేను పైకి పరిగెట్టుకువెళ్లి ఎనిమిదో ఫ్లోర్‌లో ఉన్న బాంబే కంపెనీ వాళ్లకి చెప్పాను. హడావుడిగా చెప్పానేమో ఆ రిసెప్షనిస్టుకి నేనేం చెప్పానో అర్థమే కాలేదు. నా వాలకం చూసి బయటకు వచ్చిన మేనేజరు గారికి అర్థమయ్యిందిలాగుంది. ఆయనే ఫోన్ లాక్కొని మీకు ఫోన్ చేసారు."

"అవును. అది మాకు తెలుసులే. దొంగ హఠాత్తుగా ఎలా మాయమయిపోయాడో, కాష్ బాగ్ ఎక్కడ దాచారో అది కావాలి మాకు. ఎవరూ బ్యాగ్‌తో బయటకు వెళ్లలేదని వాచ్‌మన్ చెప్తున్నాడు. మధు ఎక్కడికి పోయాడో అది చెప్పు ముందు."

"ఫోన్ చేయించి బయటకు రాగానే మధు కనబడ్డాడు, కాంప్లెక్స్ వాచ్‌మన్‌తో మాట్లాడుతూ. హమ్మయ్య అనుకున్నాను ఒక్కసారి. తర్వాత నా చూపు నా లిఫ్టు పానెల్ మీద పడింది. రెండో ఫ్లోర్‌లో ఆగిపోయి ఉందది. ఎవరూ కాంప్లెక్సు విడిచి వెళ్లకుండా చూడమని వాచ్‌మన్‌కి చెప్పేసి మేనేజరు గారు విజయ నడిపే పక్క లిఫ్ట్‌లోకి ఉరికారు. మధు కూడా ఆయన వెంటే... నన్నెవరూ రమ్మనకపోయినా నేనూ వెళ్లాను.

మేనేజరు గారు విజయను అడిగేరు, – "సెకండ్ ఫ్లోర్ నుండి ఎవరైనా పైకి వచ్చారా నీ లిఫ్టులో?" అని.

"లేదండి." అంది విజయ.

సెకండ్ ఫ్లోర్‌కి చేరి చూడబోతే నా లిఫ్టులో ఎవరూ లేరు. "పైకి రాలేదు కాబట్టి బేస్‌మెంట్‌కి వెళ్లాడేమో వాడు" అంటూ మధు కిందకు పరిగెత్తాడు. అక్కడా లేడు వాడు.

మేనేజరు గారు 'మనం చేయగలిగేదేమీ లేదు. పోలీసుల్ని రానివ్వండి.' అన్నారు. మీరొచ్చేదాకా ఈ ఆఫీసులోనే అందరం కూచున్నాం. మీరు రావడం, అంతా వెతకడం, దొంగ అంతర్ధానమవడం అన్నీ మీకే తెలుసు." అంటూ సుభాషిణి తన కథనం ముగించింది.

ఆమెనక్కడే ఉండమని చెప్పి శుభాంకర్ మధుని లోపలికి పిలిపించాడు. అతన్ని చూస్తూనే చిరునవ్వు నవ్వుతూ, "మధూ! నన్నెక్కడైనా చూసిన గుర్తుందా?" అని అడిగాడు.

మధు తలకాయ దించుకున్నాడు. "ఉంది" అన్నాడు మెల్లగా.

"ప్రియంవదా కాంప్లెక్స్..." అన్నాడు శుభాంకర్ అదోలా నవ్వుతూ.

"అదేమిటి?" అన్నాడు మేనేజరు తెల్లబోతూ.

"ఇలాటి కేసే లెండి. సేమ్ టైపు. కాస్త మార్పులతో. మధుని అనుమానితుడిగా అరెస్టు చేయడం, నేనే కేసు నడపడం జరిగింది."

"కేసు కొట్టేశారు." అన్నాడు మధు ఉక్రోషంగా.

"అయినా నీకు ఉద్యోగం ఇచ్చేముందు ఆ విషయం నాకు చెప్పి ఉండాల్సింది" అన్నాడు మేనేజరు చిరాకుపడుతూ.

"సార్. నేను ఇక్కడికి లిఫ్ట్ మెకానిక్‌గా వచ్చాను. వచ్చిన చాలా రోజుల తర్వాత మీరే పిలిచి ఈ పని ఇచ్చారు..."

"పోనీ అప్పుడైనా చెప్పి ఉండాల్సింది."

"ఇలాటి సంఘటనే రెండు సార్లు జరుగుతుందని నేను అనుకోలేదు..." అన్నాడు మధు తలవంచుకుంటూ.

"...అంతేకాదు, ఆ కేసు డీల్ చేసిన నేనే మళ్లీ ఇప్పుడూ ప్రత్యక్షమవుతానని అనుకోలేదు పాపం. ప్యూర్ కోయిన్సిడెన్స్. అవును, ఆ బాగ్ ఏం చేసావ్, మధూ?"

సుభాషిణికి ఏడుపు వచ్చింది. మధు కోపంతో విరుచుకుపడతాడనుకుంది. కానీ అతను ఏ మాత్రం ఆవేశపడకుండా "లిఫ్ట్‌లోంచి నేను ఒట్టి చేతుల్తో బయటపడ్డానని మీకు తెలుసుగా" అనబోయేడు.

"అది సరేలే, నువ్వొకణ్ని తోడుగా పెట్టుకున్నావనుకో. వాడు డ్రామా ఆడేసి, నిన్ను బయటకు నెట్టేసి బాగ్‌తో సహా లిఫ్ట్‌ను సెకండ్ ఫ్లోర్‌కి తీసుకెళ్లిపోవచ్చు. నువ్వు మెట్లదారి ద్వారా సెకండ్ ఫ్లోర్‌కి వెళ్లి అతని దగ్గర బాగ్ తీసుకుని నీ దగ్గర పెట్టుకుని అతను క్రిందకు వెళ్లి రోడ్డు మీదకు రాగానే అతని చేతిలో పడేటట్టు బాల్కనీలోంచి నువ్వు విసరవచ్చు. బాగ్‌తో లిఫ్టులోంచి బయటకు వెళితేనే అందరిదృష్టీ పడుతుంది. ఇలా అయితే అతని చేతులూ ఖాళీగా ఉంటాయి..."

"అనుమానించడానికి నేనొక్కణ్నే దొరికానా? ఇద్దరు కావాలి కదా ఈ నేరం చేయడానికి. నాతో చేతులు కలిపే వాళ్లెవరున్నారు చెప్పండి? మా సీనియర్ దామోదరం ఫోర్త్ ఫ్లోర్‌లో పనిచేస్తున్నానని అన్నాడు. అది మాత్రం నిజమని నమ్మాలని ఏముంది? ఆయనే చేసి ఉండవచ్చు కదా!"

సుభాషిణికి బాగా తెలుసు. దామోదరానికి, మధుకి పడదనీ, దామోదరం మధుని ఎప్పుడూ అవమానిస్తూనే ఉంటాడనీ...

"అతను టాయిలెట్‌లో ఉండగా చూసానని ఓ కుర్రాడు అంటున్నాడు." అన్నాడు శుభాంకర్

"ఎన్ని గంటలకి?"

"టైము చూడలేదట గానీ రమారమి ఆ ప్రాంతంలోనేట."

"మమ్మల్ని ఇన్ని ప్రశ్నలడుగుతున్నారు గానీ, టైము సరిగ్గా చెప్పకపోయినా అతన్ని వదిలేస్తున్నారు!" అంది సుభాషిణి కోపంగా.

మధు అప్పుడప్పుడు ఆకాశానికి నిచ్చెనలు వేయడం తనకు తెలుసు. 'జీవితంలో పైకొచ్చే సాధనం నీ చేతిలో ఉంది. నువ్వందరినీ పైకి తీసుకెళ్లడమే కానీ, నువ్వు మాత్రం పైకి వచ్చి ఉండిపోవు. వెంటనే కిందకు వెళ్లిపోతుంటావు. మనం ఏదో సాహసం చేసి పైనే ఉండిపోవాలి!' అంటూంటాడు ఆమెను ఉడికిస్తూ. 'మనం పెళ్లి చేసుకుంటే ఇవి కొందాం, అవి కొందాం!' అని గాలిమేడలు కడుతూంటాడు. కానీ దానికోసం ఇలాంటి పని చేస్తాడని అనుకోలేకపోతోంది. ప్రియంవద కాంప్లెక్స్ కేసులో పాపం ఇరుక్కున్నాడులా వుంది. దాని గురించి ఈసారి అడగాలి, తనకు ముందే ఎందుకు చెప్పలేదో! అనుకుంది.

శుభాంకర్ సమాధానం చెప్పకుండా "నిన్ను కాదు అనుమానించేది. నువ్వు వెళ్లవచ్చు. వెళ్లి నీ లిఫ్ట్ ఆపరేట్ చేసుకో! మేం దాన్ని పరీక్షించడం అయిపోయింది. ఇంకా కాసేపు దాన్ని ఆపి ఉంచేస్తే జనాలు విరుచుకుపడతారు!" అంటూ ఆమెను పంపించేశాడు.

అతని నిర్లక్ష్యం ఆమెకు కోపం తెప్పించింది. ఎలాగోలా మధుని నిర్దోషిగా నిరూపించి తనవాడిని చేసుకోవాలని ఒట్టేసుకుంటూ లిఫ్ట్‌లోకి వచ్చింది. అన్యమనస్కంగానే లిఫ్ట్ స్టార్ట్ చేసి కిందకు వెళ్లసాగింది. ఏదో ఆలోచిస్తూ కిందకు చూసిన ఆమెకు కార్పెట్ నిండా మరకలు కనపడ్డాయి. తను, మధు కలిసి మొదటిసారి సినిమాకు వెళ్లిన రోజు గుర్తుకు వచ్చింది. అంతలోనే గుర్తుకు వచ్చింది ఆ విధమైన మరకలు ఎందుకు పడ్డాయో! ఒకవేళ లిఫ్ట్ ఫాల్స్ సీలింగ్‌లో... అనుకోగానే ఆలస్యం చేయకుండా తను కూర్చొనే స్టూలు ఎక్కి ఫోన్ పక్కనున్న తలుపు తీసి లోపలికి తొంగి చూసింది.

అక్కడ బాగ్ కనపడగానే ఆమె హృదయం గంతులు వేసింది. వెంటనే చేయి చాచి అందుకుని దుమ్ము దులిపి గుండెలకు హత్తుకుంటూ 'హమ్మయ్య! దీంతో మధు బయటపడ్డట్టే!' అనుకుంది.

అంతలోనే ఆమె వీపులో తుపాకి గుచ్చుకోవడంతో తిరిగి చూసింది. దామోదరం. లిఫ్ట్ ఎప్పుడు ఆగిందో, దామోదరం ఎలా లోపలికి ప్రవేశించాడో ఆమె గమనించనేలేదు. లిఫ్ట్‌ని మధ్యలో ఆపేశాడు "ఆ బాగ్ ఇలా ఇచ్చేయ్, బుల్లీ!" అన్నాడు కటువుగా.

సుభాషిణి ఇవ్వలేదు. "ఎందుకిస్తాను? ఇది పోలీసులకు అప్పగించి మధుని విడిపిస్తాను. నీకూ, మధుకు వైరం ఉండవచ్చు. కానీ నువ్వు ఇంత నీచానికి పాల్పడతావని అనుకోలేదు. డబ్బు కొట్టేసి మధు మీదకు నెట్టేద్దామని నీ ఐడియా. పాపం, అతను ఇంతకుముందు ఇలాంటి కేసులో ఇరుక్కున్నాడు కాబట్టి అనుమానం అతని మీదకు పోతుంది. నువ్వు హాయిగా డబ్బు తీసుకుని ఉడాయించవచ్చు!" అంది అతనిపై అసహ్యాన్ని బాహాటంగా కనబరుస్తూ. అతని చేతిలో తుపాకీ ఉందన్న విషయం కూడా ఆమెను భయపెట్టలేదు.

మధుపట్ల ఆమె కురిపిస్తున్న అభిమానం చూసి దామోదరానికి నవ్వు వచ్చింది. "సుభాషిణీ! ఇది నేనూ, మధూ కలిసి ప్లాన్ చేసినదే. ముసుగు మనిషిని నేనే. మీ ఇద్దర్నీ తోసేసి కాష్‌బాగ్ సీలింగ్‌లో పెట్టేసి నాలుగో ఫ్లోర్‌లో దిగిపోయాను. టాయిలెట్‌లో ఉన్న కుర్రాడి వల్ల నాకు ఎలిబయ్ ఉంది. ఎవరికీ అనుమానం రాదు. పాత కేసు వల్ల మధు మీద అనుమానం వస్తుందని మాకు ముందే తెలుసు. అందుకనే నీ ఎదురుగానే డ్రామా ఆడాం. నీ ఎలిబయ్యే అతన్ని కాపాడుతుంది. నీ కున్న ఇమేజే మాకు శ్రీరామరక్ష! మేం ఇద్దరం కలిసి ఈ పని చేశామని ఎవరూ అనుకోరు. మేం బయట ఎప్పుడూ పోట్లాడుకుంటూ ఉంటాం కాబట్టి చేతులు కలిపి ఉంటామని ఎవరూ అనుకోరు!"

సుభాషిణి నమ్మలేకపోయింది. మధుకి ఆశలు ఉన్నాయన్నమాట నిజమే కానీ, ఇలా దొంగతనానికి ఒడిగడతాడా?

"నిజం చెప్పు. నేరం మధు మీదకు నెట్టాలని చూడకు! నువ్వు ఇక్కడకు ఎందుకు వచ్చినట్టు?"

"మధుయే చెప్పాడు. కాస్సేపు పోయాక బాగ్ లిఫ్ట్‌లోంచి తీసేసి వాళ్ల రూమ్మేటు జనార్దనానికి ఇమ్మనమని. అతను ఇక్కడకు వస్తాడట. అతన్నెవరూ అనుమానించరు కాబట్టి డబ్బు సురక్షితంగా మధు రూముకు చేరుతుంది. పోలీసులు నన్ను విచారించినా ఏ సాక్ష్యమూ దొరకదు." అంటూనే ఆమెకేసి చూసి, "నాకు తెలుసు. నువ్వు నమ్మటం లేదు. ఈ తుపాకీ చూడు. మధుదే. బెదరగొట్టడానికి ఇచ్చాడు." అంటూ ఆమె చేతికిచ్చాడు.

సుభాషిణి చూసింది. నిజమే. అది మధుదే. బొమ్మ తుపాకి. పేలదు కానీ నెత్తి మీద కొడితే స్పృహ తప్పుతుంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇందాకా జనార్దనం కనబడ్డాడు కూడా. అంటే దామోదరం చెప్పింది నిజమేనన్నమాట. మధు మంచివాడనుకుంటే ఇటువంటివాడన్నమాట. ఆమె ఆలోచిస్తూనే "జనార్దనం నీకు తెలుసా?" అంది.

"తెలియదు. ఎప్పుడూ చూడలేదు. ఎవరాని అడగాలి."

"దాని గురించి కాదు. జనార్దనం ఎటువంటి వాడో తెలుసా? అని."

"ఏమో, తెలియదు."

"ఒకవేళ అతను డబ్బు కొట్టేస్తే? అంతకంటే బెటరేమిటంటే నేనే ఈ డబ్బు బయటకు చేరేస్తాను. నా దగ్గరుంటే సేఫ్. మధు కూడా ఏమీ అనడు. నువ్వూ త్వరగా బయటకు వచ్చేయ్. మనం ముగ్గురం పంచుకోవచ్చు. జనార్దనాన్ని గంగలోకి దిగనీ." అంది.

"ఎలా చేరేస్తావ్? నీ యూనిఫాం జేబుల్లో ఎన్ని కట్టలు పడతాయి కనక?"

"నాకా మాత్రం తెలియదా? మనిద్దరం మా డ్రెస్సింగు రూమ్‌కి వెళదాం. అక్కడ నా లోపల పరికిణీని సంచీలా చేసి దానిలో

డబ్బు పెట్టేసి నడుం చుట్టూ కట్టేసుకుంటాను. నా పెర్సనాలిటీ వల్ల ఎవరికీ పెద్ద తేడా తెలియదు. నా విచారణ అయిపోయింది కాబట్టి నేను వెళుతూంటే ఎవరూ ఆపరు.” అంది సుభాషిణి.

పది నిమిషాల్లో వాళ్లిద్దరూ బాగ్‌లోంచి డబ్బు ఖాళీ చేసి బాగ్ విసిరేయడం జరిగింది. సుభాషిణి నడుం చుట్టూ పరికిణీ కట్టే ప్రక్రియలో దామోదరం వేడెక్కిపోవడం జరిగింది. ఆమె పరిస్థితీ అందుకు భిన్నంగా లేదు. డ్రెస్సింగు రూమ్‌లోకి ఎవరూ రాకపోవడం వారి కోరికలకు దోహదం చేసింది. “మధు కంటే నువ్వు ఏ విషయంలో తక్కువ? నేను నచ్చితే చెప్పు. మనం ఇద్దరం ఈ డబ్బు పట్టుకుని పారిపోదాం. మధుకి టాటా చెప్పేద్దాం.” అంది సుభాషిణి దామోదరం కౌగిలిలో కరిగిపోతూ.

“నువ్వు వాడి గురించి కాస్త అనుమానంగా మాట్లాడితే చాలు. వాడికి ఎలిబయ్ లేకుండా పోతుంది. వాడు జైల్లో. మనం ఇదిగో ఇలా...” అంటూ ఆమెలో ఐక్యం అయిపోసాగాడు దామోదరం. కొద్ది నిమిషాలలోనే అతని కళ్లు మూతలు పడసాగాయి. అవి మరింతగా మూతపడేటట్లు చేసింది సుభాషిణి అతని తలమీద కొట్టిన దెబ్బ. అతని శరీరం నుండి విడివడుతూ పక్కన పెట్టిన తుపాకీ మడమతో అతని తల మీద కొట్టిందామె.

“నాకు వాడూ వద్దు, నువ్వూ వద్దు. ఇద్దరూ దొంగవెధవలే. ఇవాళ కాకపోతే రేపైనా నన్ను ఇరికించగలరు. హాయిగా ఈ డబ్బుతో ఇంకో ఊరెళ్లి దర్జాగా ఓ మంచాణ్ని పెళ్లాడతా.” అంది సుభాషిణి కసిగా దామోదరాన్ని కాలితో తంతూ. గబగబా బట్టలు సర్దుకుని తలుపు తీసి బయటపడింది.

పదినిమిషాల్లో ఆమె తప్పించుకోగలిగేదే, కాంప్లెక్స్ బయట శుభాంకర్ ఆమె కోసం కాపు వేయకపోతే. అతని వెంటనున్న కానిస్టేబుల్స్ ఆమెను సోదా చేసి డబ్బు వశపరుచుకుంటూంటే అన్నాడు శుభాంకర్ – “అందరూ నీ నిజాయితీ గురించి చాలా చెప్పారు. అందుకే అనుమానం వచ్చింది. నీ ఇమేజి అడ్డుపెట్టుకునే మధు నాటకం ఆడివుంటాడని. నీలాటి ఆడవాళ్లను ప్రేమించినట్టు నటించి అందమైన మగవాళ్లు ఏ పనైనా మీ చేత చేయించగలరు. నువ్వతనితో చేతులు కలిపి డబ్బు బయటకు చేరేయడానికి సాయం చేయబోయావు. పట్టుబడ్డావు!”

(George Harmon Coxe రాసిన *“A Neat and Tidy Job”* *అనే కథను ఆధారం చేసుకుని రాసిన కథ యిది.)*

**– ఎమ్బీయస్ ప్రసాద్ (డిసెంబరు 2011)**